## బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా స్వామి

ఖలీల్‌వాడి, అక్టోబర్ 5 : బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా కోడూరు స్వామిని నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ తెలిపారు. పద్మశాలీ సంఘం నగర కార్యదర్శిగా గతంలో పని చేసిన కోడూరి స్వామి.. ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. అనంతరం కోడూరు స్వామిని బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు ఆకుల ప్రసాద్, నగర అధ్యక్షుడు దర్శనం దేవేందర్, ఎనుగందుల మురళి, కరిపె రవీందర్, నారాయణరెడ్డి, నారాయణరావు నాని, లక్ష్మణ్‌గౌడ్, శ్రీలత, విజయ్, హన్మంత్‌రావు, పోశెట్టి, విష్ణు, సదానంద్, వెంకటేశ్, భీమర్తి రవి, శ్రీనివాస్, చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

## 23న విజయదశమి

నిజామాబాద్ కల్చరల్, అక్టోబర్ 5 : విజయానికి ప్రతీకగా జరుపుకొనే విజయదశమి పర్వదినాన్ని ఈనెల 23వ తేదీన (సోమవారం) జరుపుకోవాలని తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఇందూరు అధ్యక్షుడు కిరణ్‌కుమార్ దేశ్‌ముఖ్, కార్యదర్శి రొట్టె సురేశ్ స్పష్టంచేశారు. ఈ మేరకు వారు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. సూర్య సిద్ధాంత రీత్యా స్థానిక పండితుల సూచనలతో ఈనెల 23న మహర్నవమి, దసరా, శమీపూజ, 24న శ్రీరామ పట్టాభిషేకం, 25న రథోత్సవం జరుపుకోవాలని సూచించారు.

## ప్రజాసమస్యల పరిష్కారానికి చొరవచూపాలి

- మండల సర్వసభ్య సమావేశంలో

### రూరల్ ఎంపీపీ బానోత్ అనూషా ప్రేమ్‌దాస్

నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 5 : ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజాసమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని రూరల్ ఎంపీపీ బానోత్ అనూషాప్రేమ్‌దాస్ అన్నారు. నగరంలోని జడ్పీ హాలులో ఆమె అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. అర్హులైన వారికి గృహలక్ష్మి పథకం కింద పక్కా ఇండ్లు మంజూరు చేయాలని ఎంపీటీసీలు, సర్పంచులు కోరారు. జడ్పీటీసీ బొల్లెంక సుమలతా గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు అర్హులకు అందేలా చూడాలని అధికారులను కోరారు. పండ్ల తోటల పెంపకంపై రైతులు ఆసక్తి చూపాలని ఉద్యానశాఖ అధికారిణి సంధ్య కోరారు. అభివృద్ధి పనులకు సంబంధించి అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి హీరాజాదవ్, ఎంపీడీవో మల్లేశ్, సూపరింటెండెంట్ ప్రవీణ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, మండల నాయబ్ తహసీల్దార్ రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

## జల్లాపల్లి ఆబాదిలో విగ్రహాల ఊరేగింపు



విగ్రహాల ఊరేగింపులో పాల్గొన్న పోచారం సురేందర్‌రెడ్డి, గ్రామస్తులు

కోటగిరి, అక్టోబర్ 5 : పొతంగల్ మండలం జల్లాపల్లి ఆబాదిలో సేవాలాల్, దుర్గామాత విగ్రహాలను గురువారం ఊరేగించారు. జల్లాపల్లి ఆబాదిలో నూతనంగా సేవాలాల్ ఆలయం నిర్మించామని, త్వరలో విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాన్ని నిర్వహించనున్నట్లు సర్పంచ్ వివేక్ తెలిపారు. జైపూర్ నుంచి విగ్రహాలను తీసుకొచ్చామని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ భీమ, వార్డుసభ్యులు సాయి నాయక్, దేవీసింగ్, బిక్యా, ఫకీరా పాల్గొన్నారు.

## యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో మెగా ఉత్సవ్ మేళా



రుణాలను అందజేస్తున్న బ్యాంకు అధికారులు

ఖలీల్‌వాడి, అక్టోబర్ 5 : యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని ఖలీల్‌వాడిలో ఉన్న ముదిరాజ్ సంఘంలో మెగా ఉత్సవ్ మేళాను గురువారం నిర్వహించారు. 65 స్వయం సహాయక సంఘాల (400 మంది)కు రూ. 8 కోట్ల రుణాలు అందజేశామని బ్యాంకు అధికారులు తెలిపారు. యూనియన్ బ్యాంకు ద్వారా అందజేసే వివిధ రుణాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా మిషన్ కో-ఆర్డినేటర్ శోభారాణి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ శంకర్ హేంబ్రామ్, డిప్యూటీ రీజినల్ హెడ్ శివ కోటయ్య, టౌన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేశ్, జిల్లాలోని వివిధ బ్రాంచ్‌ల సిబ్బంది పాల్గొన్నారు.

# మారనున్న ధర్పల్లి రూపురేఖలు



అద్దంలా మెరుస్తున్న ధర్పల్లి-ఇందల్వాయి రోడ్డు

ధర్పల్లి, అక్టోబర్ 5 : స్వరాష్ట్ర సాధనకు ముందుఅంతగా అబివృద్ధికి నోచుకోని ధర్పల్లి ప్రస్తుతం అభివృద్ధిలో దూసుకుపోనున్నది. తనకు విద్యాబుద్ధులు నేర్పిన ధర్పల్లిని అభివృద్ధి చేయాలన్న ధృఢ సంకల్పంతో ఉన్న రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్.. అందుకు తగిన విధంగా కృషిచేస్తున్నారు. ఇప్పటికే మండలకేంద్రంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టగా.. నేడు (శుక్రవారం) ప్రారంభించే అభివృద్ధి పనులతో మండలం అభివృద్ధిలో మరింత దూసుకుపోనున్నది.

**నేడు అభివృద్ధి పనులను ప్రారంభించనున్న మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి**

ధర్పల్లి మండలకేంద్రంలో 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఉండగా.. దానిని వంద పడకల దవాఖానగా మార్చేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నేడు (శుక్రవారం) మంత్రి హరీశ్‌రావు.. మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాల ఎదురుగా సుమారు 4 ఎకరాల స్థలంలో రూ.33.15 కోట్లతో చేపట్టే వంద పడకల దవాఖాన భవన నిర్మాణ పనులకు మంత్రి వేములతో కలిసి శంకుస్థాపన చేయనున్నారు. మండలకేంద్రంలో రూ.6.5 కోట్లతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నారు. ఇందల్వాయి కమాన్ నుంచి ఇటు దమ్మన్నపేట్ చౌరస్తా వరకు, అటు భీంగల్ రోడ్డు కమాన్ వరకు చేపట్టే పనులకు మంత్రి హరీశ్‌రావు భూమి పూజ చేయనున్నారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయితే ధర్పల్లి రూపురేఖలు పూర్తిగా మారనున్నాయి.

**ఇప్పటికే ఎంతో అభివృద్ధి...**

రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ మండలాన్ని ఎంతో అభివృద్ధి చేశారు. మండల కేంద్రంలోని అన్ని వీధుల్లో రూ. 70 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం, నూతన బస్టాండ్‌లో ఆధునిక హంగులతో సౌకర్యాలు, రూ. 2.36 కోట్లతో ధర్పల్లి పెద్ద చెరువుకు మరమ్మతులు చేయించి మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దారు. పెద్దచెరువులో బోటింగ్ పాయింట్ ఏర్పాటు చేయించారు. బోటును నేడు ప్రారంభించనున్నారు. మండలకేంద్రంలో 1.08 ఎకరాల స్థలంలో 48 డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం పూర్తయ్యింది. వీటిని పేదలకు అందించనున్నారు. ఇందల్వాయి – ధర్పల్లి రోడ్డును పెద్దవాల్గోట్ వరకు రూ. 11 కోట్లతో బీటీ రెన్యువల్ పనులు చేయించారు. వాడి గ్రామం వాగుపై రూ. 7 కోట్లతో బ్రిడ్జిని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. అన్ని కుల సంఘాల కమ్యూనిటీ భవన నిర్మాణాల కోసం కోట్ల రూపాయలు అందించారు. ధర్పల్లి నుంచి రేకులపల్లికి రూ. 1.98 కోట్లతో తారు రోడ్డు నిర్మాణం చేపట్టారు.

**నేడు మండలకేంద్రంలో అభివృద్ధి పనులను ప్రారంభించనున్న మంత్రులు**




ధర్పలిల్లో పూర్తయిన డబుల్ ఇండ్లు

**మున్సిపాలిటీగా మారనున్న ధర్పలి ...**

ధర్పల్లి మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే బాజిరెడ్డి.. మున్సిపాలిటీగా మార్చాలని పట్టుదలతో ఉన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే పలుమార్లు సభల్లో సైతం వెల్లడించారు.

**'రూరల్'ను అభివృద్ధికి మారుపేరుగా తీర్చిదిద్దుతా..**



రూరల్ నియోజకవర్గాన్ని అభివృద్ధికి మారుపేరుగా తీర్చిదిద్దడమే నా ధ్యేయం. ప్రజలు తనను మరోసారి ఆశీర్వదిస్తే.. మరింత అభివృద్ధి చేసి చూపిస్తా. నేను చదువుకున్న ధర్పల్లిని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న. మారుమూల ప్రాంతాలైన ఇందల్వాయి, ధర్పల్లి, సిరికొండ మండలాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిచాలన్న ఉద్దేశంతో ధర్పల్లి సెంటర్‌గా వంద పడకల దవాఖానను నిర్మిస్తున్నాం. ఇందల్వాయిలో మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని సైతం ఏర్పాటు చేయిస్తా. ప్రస్తుతం ఉన్న ధర్పల్లిలోని 30 పడకల దవాఖానలో నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేయించాలని మంత్రి హరీశ్‌రావును కోరుతా.

**- బాజిరెడ్డి గోవర్ధన్, రూరల్ ఎమ్మెల్యే**

## జోనల్‌స్థాయి కబడ్డీ పోటీల్లో ఇందల్వాయి విద్యార్థుల ప్రతిభ

ఇందల్వాయి, అక్టోబర్ 5 : బాల్కొండలో ఇటీవల నిర్వహించిన జోనల్ స్థాయి కబడ్డీ పోటీల్లో ఇందల్వాయి పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారు. అండర్-14, 17 విభాగంలో విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించారని ప్రిన్సిపాల్ శ్రీలత తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయ బృందం గురువారం అభినందించింది.

## 'తల్ సైనిక్'లో ఇందూర్ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన వారిని సన్మానిస్తున్న ఎన్‌సీసీ అధికారులు, ఎన్‌సీసీ కెడెట్లు

నిజామాబాద్ స్పోర్ట్స్, అక్టోబర్ 5 : ఢిల్లీలో నిర్వహించిన తల్‌సైనిక్ శిబిరంలో నిజామాబాద్‌లోని 12వ ఎన్‌సీసీ బెటాలియన్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. కెడెట్ జైనా బానిక్ ఫైరింగ్‌లో సిల్వర్ మెడల్, జేయూవో ఎస్.దినేశ్ ఫైరింగ్‌లో బ్రాంజ్ మెడల్ సాధించారు. ఎస్‌యూవో నిఖిలేశ్ శిబిరంలో పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చి గురువారం ఉదయం నిజామాబాద్‌కు రాగా.. రైల్వేస్టేషన్‌లో వారికి ఎన్‌సీసీ అధికారులు, కెడెట్లు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు.

## ఆలయ పాలక మండలి చైర్మన్ల ప్రమాణ స్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న శంభుని గుడి పాలక మండలి

నిజామాబాద్ కల్చరల్, అక్టోబర్ 5 : జిల్లాకేంద్రంలోని జెండా బాలాజీ మందిరం, శంభులింగేశ్వరాలయం, హమాల్‌వాడీ సాయి బాబా ఆలయ చైర్మన్లు పాలకవర్గ ధర్మకర్తలుగా గురువారం సాయంత్రం ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లా దేవాదాయ, ధర్మదాయశాఖ సహాయ కమిషనర్ సుప్రియ ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ కమల ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేయించారు. జెండా బాలాజీ మందిరం చైర్మన్‌గా జాలిగం గోపాల్, శంభులింగేశ్వరాలయ చైర్మన్‌గా గాండ్ల లింగం, హమాల్‌వాడ సాయి సంతోషీమాత మందిరం చైర్మన్‌గా ఎం.శ్రీధర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్లు మాట్లాడుతూ.. ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. తమకు చైర్మన్లుగా అవకాశం కల్పించిన అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తాకు కృతజ్ఞతలు తెలిపారు.

## హరీశ్‌రావు సభకు పెద్దసంఖ్యలో తరలిరావాలి

- ధర్పల్లి జడ్పీటీసీ సభ్యుడు బాజిరెడ్డి జగన్
- సభ ఏర్పాట్ల పరిశీలన



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న జడ్పీటీసీ సభ్యుడు జగన్, నాయకులు

ధర్పల్లి, అక్టోబర్ 5 : మండల కేంద్రంలో వంద పడకల దవాఖాన నిర్మాణ పనులను ప్రారంభించేందుకు వైద్యారోగ్య, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు నేడు (శుక్రవారం) రానున్నారు. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, అనంతరం నిర్వహించే సభకు బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు పెద్దసంఖ్యలో తరలిరావాలని ధర్పల్లి జడ్పీటీసీ సభ్యుడు బాజిరెడ్డి జగన్ కోరారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట సభ స్థలంతోపాటు దవాఖాన నిర్మాణ స్థలాన్ని గురువారం పరిశీలించారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, ఎంపీపీ నల్ల సారికా హన్మంత్‌రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు, మండల కన్వీనర్ పీసు రాజ్‌పాల్‌రెడ్డి, ధర్పల్లి సర్పంచ్ ఆర్మూర్ పెద్దబాల్‌రాజ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్ యాదవ్, మాజీ అధ్యక్షుడు నల్ల హన్మంత్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ చెలిమెల చిన్నారెడ్డి, మాజీ చైర్మన్ జీయర్ కిశోర్‌రెడ్డి, నాయకులు సురేందర్‌గౌడ్, నజీర్, శ్రీనివాస్, ఎంపీడీవో లక్ష్మణ్, ఎంపీవో రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

**సభా స్థలాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్..**

ధర్పల్లిలో మంత్రి హరీశ్‌రావు సభాస్థలాన్ని అదనపు కలెక్టర్ యాదిరెడ్డి పరిశీలించారు. హెలీప్యాడ్ స్థలం, సభ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడారు. సభా స్థలం వద్ద ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ప్రజాప్రతినిధులు, ఎంపీడీవో లక్ష్మణ్, ఎంపీవో రాజేశ్, తహసీల్దార్ మాలతి, సిబ్బంది ఉన్నారు.